సాక్షి ప్రకాశం

శుక్రవారం । 19 । జనవరి । 2024



ముసిపై ఆనకట్ట

చిలంకూరు వద్ద ముసి నదిపై ఆనకట్ట నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు.

- 8లో..



టీకాలతో పశువులకు రక్ష

గాలికుంటు వ్యాధి టీకాలతో పశువులకు రక్షణ కలుగుతుందని ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ అధికారి పద్మావతి తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30.5/21.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా దద్దాల నారాయణ యాదవ్



సీఎం వైఎస్ జగన్‌తో దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా దద్దాల నారాయణ యాదవ్‌ను పార్టీ అధిష్టానం గురువారం రాత్రి ప్రకటించింది. వెలిగండ్ల మండలం పెరుగుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రస్తుతం హనుమంతునిపాడు మండలం జెడ్పీటీసీ సభ్యునిగా ఉన్నారు. దద్దాల నారాయణ సతీమణి దద్దాల మంజుభార్గవి హుస్సేన్‌పురం పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. రియల్టర్‌గా, గ్రానైట్ వ్యాపారవేత్తగా కనిగిరిలో గుర్తింపు పొందారు. నారాయణ యాదవ్ 2014 నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో హనుమంతునిపాడు మండల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థిపై భారీ మెజార్టీతో గెలుపొందారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ క్యాడర్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. నియోజకవర్గంలో పలు సేవాహిత కార్యక్రమాలు చేపట్టి అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితుడిగా ఉన్నారు. దద్దాల నారాయణ యాదవ్‌ను కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ప్రకటించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు, దద్దాల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ఒంగోలు సిటీ: జిల్లాలోని 13 ఐసీడీఎస్ కార్యాలయాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు సంబంధించి ఆయా సీడీపీఓ కార్యాలయాల్లో ఈ నెల 19వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ పీడీ కె.మాధురి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 13 ఐసీడీఎస్ కార్యాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 20 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, 5 మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, 75 అంగన్‌వాడీ ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 19 నుంచి 27 వ తేదీ లోపల సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పీడీ మాధురి చెప్పారు.

జీజీహెచ్ ఆర్‌ఎంఓగా డా.హనుమంతరావు



డాక్టర్ ఏ.హనుమంతరావు

ఒంగోలు టౌన్: ఒంగోలు జీజీహెచ్ ఆర్‌ఎంఓగా డాక్టర్ ఏ.హనుమంతరావు నియమితులయ్యారు. గురువారం ఇన్‌చార్జి సీఎస్ఆర్ ఎంఓ డా.తిరుమలరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సూపరింటెండెంట్ డా.భగవాన్ నాయక్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలును మర్యాద పూర్వకంగా కలిశారు. డా.హనుమంతరావు గతంలో కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా, గుంటూరు సర్వజన ఆస్పత్రిలో మెటర్నిటీ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు వెయిటింగ్‌లో ఉన్న ఆయన కు ఒంగోలు జీజీహెచ్ ఆర్‌ఎంఓగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డా.హనుమంతరావు మాట్లాడుతూ అధికారులు, వైద్య సిబ్బంది సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తానన్నారు.

నేడు హైవేపై భారీ వాహనాల ట్రాఫిక్ మళ్లింపు

ఒంగోలు సబర్బన్: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం భారీ వాహనాల ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామి రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజయవాడలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకొని ఒంగోలు నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని, అందుకోసం భారీ వాహనాలకు, ఇతర వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ మళ్లింపు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడ వైపు వెళ్లాల్సిన వాహనాలను ఉదయం 9 గంటల నుంచి త్రోవగుంట, మద్దిరాల పాడు, చీరాల, జగ్గయ్య పేట, హనుమాన్ జంక్షన్‌ల మీదుగా వెళ్లేలా రూట్ మాప్ తయారు చేశామన్నారు. వాహనదారులు సహకరించాలన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఎన్నికలకు వెళ్తా అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పదేపదే చెబుతూ వచ్చారు. ఇందుకు అవసరమైన నిధులు తెచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధుల విడుదల జాప్యం అవుతూ వచ్చింది. పట్టు విడవకుండా ఆయన ప్రయత్నిస్తూ వచ్చారు. బుధవారం రాత్రి ప్రభుత్వం రూ.180 కోట్ల నిధులు విడుదల చేసింది. వచ్చే నెలలో ఇళ్లపట్టాలు ఇచ్చేలా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

పేదల ఇళ్ల కోసం
పట్టు విడవక..



అగ్రహారం- మల్లేశ్వరపురం వద్ద ఇళ్ల పట్టాల కోసం సేకరించిన స్థలం

- ఒంగోలులో 25 వేల మంది పేద ఇళ్ల పట్టాలకు లైన్ క్లియర్
- గతంలో రూ.30 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం
- ప్రస్తుతం రూ.180 కోట్లు విడుదల
- పేదలకు పట్టాలు దక్కకుండా టీడీపీ కుట్రలు
- తిప్పికొట్టిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- సీఎంను ఒప్పించి..నిధులు తెచ్చి
- వచ్చే నెలలో సీఎం చేతులు మీదుగా పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రమంతా పేదలకు రాష్ట్ర ప్రభుత్వ ఇళ్ల పట్టాలిచ్చింది.. చాలా ప్రాంతాల్లో శరవేగంగా ఇళ్ల నిర్మితమవుతున్నాయి..కొత్త ఊళ్లే వెలుస్తున్నాయి. అయితే ఒంగోలు నగరంలో తెలుగుదేశం పార్టీ నేతలు కుయుక్తులు పన్నడంతో పేదలు ఇళ్లకు దూరమయ్యారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర నాయకుడు దామచర్ల జనార్దన్ కుట్రలు పన్ని కోర్టులో కేసులు వేయించి పట్టాలు రాకుండా అడ్డుకున్నారు. పేదల కోసం ఎందాకైనా అన్నట్లు బాలినేని అడుగులు వేశారు. తెలుగుదేశం పార్టీ కుట్రల ఫలితంగా పేదలకు జరుగుతున్న అన్యాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నారు. ఎంత ఖర్చయినా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఎం ముందుకు వచ్చారు. ఒంగోలు నగర పరిసరాలతో పాటు ఒంగోలు మండల పరిధిలో 508 ఎకరాలు సేకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని ప్రభుత్వానికి పంపారు. భూములు కొనుగోలు చేసేందుకు రూ.210 కోట్లు కేటాయించారు కూడా. ఇప్పటికే రైతుల వద్ద కొనుగోలు చేసిన భూముల కోసం రూ.30 కోట్లు విడుదల చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు కూడా. మిగతా రూ.180 కోట్లు కూడా విడుదల చేస్తూ ముఖ్యమంత్రి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

నాలుగు గ్రామాల పరిధిలో....

బాలినేని ఆదేశాలతో ఇళ్ల పట్టాల కోసం అధికారులు నగర పరిసరాల్లో నాలుగు గ్రామాలను గుర్తించారు. మొత్తం దాదాపు 25 వేల మందికి ఇచ్చే విధంగా స్థలాల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. మల్లేశ్వర పురం, అగ్రహారం, వెంగముక్కల పాలెం, వెంగముక్కల పాలెంకు ఆనుకొని యరజర్ల రెవెన్యూకు చెందిన కొంత భూమిని కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికే ఈ నాలుగు గ్రామాల పరిధిలోని 508 ఎకరాలను కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్ మంజూరు చేశారు. అయితే మొత్తంగా 430.02 ఎకరాలు సరిపోతుందని నిర్ధారించి ప్రక్రియను పూర్తి చేశారు. అందుకోసం స్థలాలు గుర్తించిన అధికారులు సర్వే నంబర్లు సబ్ డివిజన్ ప్రక్రియలు ప్రారంభించారు. సర్వే నంబర్ల వారీగా అనుభవదారులు, హక్కుదారులను గుర్తించి వారి వద్ద నుంచి కొనుగోలు చేసే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. తొలుత ప్రభుత్వం రూ.30 కోట్లు ఇచ్చింది. మిగిలిన రూ.180 కోట్లు విడుదలలో జాప్యం జరుగుతూ వస్తోంది. దీనిపై పలు మార్లు బాలినేని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే అదునుగా పచ్చ పార్టీ, ఎల్లో మీడియా బాలినేనిపై అసత్య ప్రచారానికి తెరతీశాయి. అసత్య కథనాలు వండావర్చాయి. ఆ సందర్భంగా బాలినేని సైతం వారికి గట్టిగానే సమాధానమిచ్చారు. వారి కుట్రలను ఎండగడుతూనే పేదలకు పట్టాలు ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్లబోనని స్పష్టం చేశారు కూడా.. అయినా ఆయనపై దుమ్మెత్తిపోస్తూ వచ్చారు. ఇళ్ల పట్టాల నిధులకు సంబంధించి జరుగుతున్న జాప్యాన్ని ఆయన నేరుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఎం హుటాహుటిన రూ.180 కోట్లు విడుదల చేశారు.



పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి తీరుతాం...

టీడీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి తీరుతాం. టీడీపీ కుట్రలను అడ్డుకుని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వటం మాత్రం ఆపేది లేదు. సీఎం వైఎస్ జగన్‌కు ఇళ్ల పట్టాల విషయం చెప్పాను. కోర్టు అడ్డంకులు ఉన్నందున ప్రైవేటు స్థలాలు అయినా కొనుగోలు చేసి ఇద్దామని హామీ ఇచ్చారు. దీంతో ఒంగోలు నగరం చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల పరిధిలో దాదాపు 430.02 ఎకరాలు కొనుగోలు చేసి ఇవ్వటానికి భూములు గుర్తించి కొనుగోలు ప్రారంభించాం. అందుకోసం రూ.210 కోట్లు కేటాయించారు. దాదాపు 25 వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. త్వరలో పట్టాలు ఇస్తాం.

– బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

ఫిబ్రవరి రెండోవారంలో పట్టాల పంపిణీ



ఫిబ్రవరి రెండో వారంలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి పేదల ఇళ్ల స్థలాల కోసం రూ.201.33 కోట్లు జిల్లాకు విడుదలయ్యాయి. ఈ మొత్తంలో భూముల సేకరణతో పాటు ఇళ్ల స్థలాల మధ్య రోడ్లు, సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు వినియోగించనున్నాం. మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కలపాలెం, యర్రజర్లలో పేదలకు నివేశన స్థలాలు ఇవ్వనున్నాం. పట్టాల పంపిణీ కోసం పనులను వేగవంతం చేశాం. ఫిబ్రవరిలో ఎట్టి పరిస్థితుల్లో పట్టాలు పంపిణీ చేస్తాం.

– ఏఎస్ దినేష్ కుమార్, కలెక్టర్

పేదల ఇళ్లు.. ఛాలెంజ్‌గా తీసుకున్న బాలినేని...

టీడీపీ నేతలు పేదలకు ఇళ్లు ఇవ్వకుండా అడ్డుపడటంతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఆ అంశాన్ని ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న వారికి నిలువ నీడ కల్పించాలని ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాడే తలంచారు. నగరంలో ఉన్న దాదాపు 25 వేల మందికి పైగా ఉన్న సొంత ఇళ్లు లేని నిరుపేదలకు నిలువ నీడను కల్పించాలని తలచిన వెంటనే ప్రభుత్వ స్థలం ఒకేచోట ఎక్కడ ఉందో పరిశీలించాలని రెవెన్యూ అధికారులను పురమాయించారు. యరజర్ల వద్ద ఒకేచోట 818 ఎకరాలు ఉండడంతో దానిని ఎంపిక చేశారు. చదును చేసి ప్లాట్లు కూడా వేశారు. అయితే టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల చేత హైకోర్టులో కేసు వేయించి అక్కడ ప్లాట్లు ఇవ్వనీయకుండా అడ్డుకున్నారు. అయినా మొక్కవోని దీక్షతో అనుకున్న విధంగా ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించటమే ప్రధాన ధ్యేయంగా తన ఆలోచనలకు పదును పెట్టారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోయినా ప్రైవేటు స్థలం అయినా కొనుగోలు చేసి ఇవ్వాల్సిందేనని గట్టి నిర్ణయానికి వచ్చారు. స్థానికంగా పేదలు నష్టపోతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడం, అందుకు అవసరమైన నిధులు తెచ్చుకోవడంలో బాలినేని సఫలీకృతులయ్యారు.

అంబేడ్కర్ మార్గంలో సీఎం జగన్

- అట్టడుగు వర్గాల అధికారానికి కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సెంట్రల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తూ బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థికంగా ప్రాధాన్యత కల్పించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 206 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 'సామాజిక న్యాయ మహాశిల్పా'న్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో 'సామాజిక సమతా సంకల్పం' కార్యక్రమం గురువారం ఒంగోలులో చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అధికారం కోసం కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధనకు నిత్యం కృషి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు చట్టసభల్లో మెరుగైన ప్రాతినిధ్యం కల్పించటంతో పాటు ప్రజలకు మెరుగైన జీవనాన్ని కల్పిస్తున్నారని కొనియాడారు. నాడు బలహీన వర్గాలకు ఆలయాల్లోకి ప్రవేశం ఉండేది కాదని.. నేడు ఏకంగా ఆలయ ధర్మకర్తల మండలిలో ఆయా వర్గాల వారికి ముఖ్యమంత్రి స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. పేదలందరికీ మెరుగైన విద్య, వైద్యం, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశ పెట్టారని అన్నారు. ఆత్మస్థైర్యంతో బడుగు, బలహీన వర్గాలు ముందడుగు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా పరంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ స్ఫూర్తితో మరింత ముందుకు సాగేలా విజయవాడ నడిబొడ్డున నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ విజ్ఞానం, అభ్యుదయ భావం, పోరాట పటిమకు నిదర్శనమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిమను చరిత్రలో నిలిచిపోయేలా ఆవిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. అంబేడ్కర్‌ను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, భవిష్యత్ తరాలకు ఆయన గొప్పదనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని వివరించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగు జాడల్లో బడుగు, బలహీన వర్గాల వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు.

ప్రత్యేక గీతం ఆవిష్కరణ:

'భారత రత్నమా – జాతికి దీపమా' అంటూ అంబేడ్కర్‌పై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ ఆవిష్కరించగా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, అతిథులు వీక్షించారు. ఈ పాట రూపొందించటంలో ముఖ్య భూమిక పోషించిన రచయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి, సంగీత దర్శకుడు ఖాసిం, గాయకుడు నూకతోటి శరత్ బాబు, సమర్పకుడు ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అభినందించారు.

భారీ ర్యాలీ, మానవహారం ఏర్పాటు:

ముందుగా హెచ్‌సీఎం కాలేజి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, ఇతర జిల్లా అధికారులు నివాళులర్పించారు. కోలాటం, డప్పు వాయిద్యాలతో ర్యాలీగా వెళ్లి కోలాస్ హోటల్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మానవహారం చేపట్టారు.

ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, డీటీసీ ఆర్ సుశీల, డీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ ఉషా రాణి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ కన్నా, జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, డీవీఎంసీ సభ్యులు లక్ష్మయ్య, జయరావు, దళిత, గిరిజన సంఘాల నాయకుడు చప్పిడి వెంగళరావు, ఆంజనేయులు, రఘురామ్, పేరం సత్యం, అరుణ్ కుమార్, కోటేశ్వరరావు, కరువది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



డప్పు వాయిస్తున్న మంత్రి ఆదిమూలపు



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్



కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

అర్హులందరికీ సొంత ఇల్లు ప్రభుత్వ లక్ష్యం



వడ్డీ రీయింబర్స్‌మెంట్ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

- జిల్లాలో 74 వేల ఇళ్లు మంజూరు, ఇప్పటికే 24 వేల గృహాలు పూర్తి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: అర్హులందరికీ సొంత ఇల్లు ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఆ దిశగా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న సందర్భంగా గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొని కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 39,541 మంది ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేల చొప్పున రూ.139.30 కోట్ల విలువైన రుణాలను అందించినట్లు తెలిపారు. వారిలో ప్రస్తుతం 11,141 మంది లబ్ధిదారులకు మొదటి విడతలో రూ.1,18,51,393 వడ్డీని రీయింబర్స్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ విధంగా ఏడాదిలో రెండు సార్లు వడ్డీ రీయింబర్స్ చేస్తారన్నారు. జిల్లాలో మొత్తం 74 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. వాటిలో ఇప్పటికే 24 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో వేగంగా నిర్మిస్తున్నారన్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా అన్నీ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్థికంగా, మౌలికపరంగా ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని వినియోగించుకుని లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. దీనిలో హౌసింగ్ పీడీ పేరయ్య, మెప్మా పీడీ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలి

- డీఈవో వీఎస్ సుబ్బారావు



పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుకు సూచనలిస్తున్న డీఈవో వీఎస్ సుబ్బారావు

ఒంగోలు: నవోదయ ప్రవేశ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని డీఈవో వీఎస్ సుబ్బారావు సూచించారు. ఈనెల 20న జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా పరీక్ష కేంద్రాల డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లకు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి పరిధిలో మొత్తం 18 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. 3921 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్న దృష్ట్యా 183 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. కందుకూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, వలేటివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, సింగరాయకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల, టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండపి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, చీమకుర్తి ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, ఒంగోలు డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల, రాంనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల, అద్దంకి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, అద్దంకి బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మార్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల (ఏ అండ్ బీ), ఇంకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల, చీరాల ఎస్ఆర్ అండ్ పీఎం ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు ఉదయం 11 గంటలకే పరీక్ష కేంద్రంలోనికి హాజరుకావాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో 18 పరీక్ష కేంద్రాల డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు హాజరయ్యారు.

క్లుప్తంగా

అదృశ్యమైన యువకుడు మృతి

కనిగిరి రూరల్: అదృశ్యమైన యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. మండలంలోని లింగారెడ్డి కొత్తపల్లికి చెందిన తిరుపతిరెడ్డి కుమారుడు మనోహర్‌రెడ్డి(19)న భోగి పండుగ రోజు సినిమాకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఎక్కడా కన్పించలేదు. ఈ క్రమంలో గురువారం పనులకు వెళ్తున్న కూలీలకు గ్రామ సమీపంలో వాగులో మనోహర్‌రెడ్డి శవమై కన్పించాడు. దీంతో స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి వెళ్లిన తల్లిదండ్రులు, పోలీసులు మృతదేహం పరిశీలించి మనోహర్‌రెడ్డిదిగా నిర్ధారించారు. మృతదేహం పూర్తిగా కుళ్లి దుర్వాసన వస్తుంది. మృతుని తల్లిదండ్రులు ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్సై కె.మాధవరావు తెలిపారు.

కారు ఢీకొని పదేళ్ల బాలిక మృతి


అల్లు మోక్షజ్ఞ మృతదేహం

వలేటివారిపాలెం: కారు ఢీకొని పదేళ్ల బాలిక మృతి చెందింది. ఈ ఘటన బుధవారం రాత్రి అయ్యవారిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లింగసముద్రం మండలంలోని ఎర్రరెడ్డిపాలెం గ్రామానికి చెందిన అల్లు మోక్షజ్ఞ(10) తన తమ్ముడితో కలిసి పండక్కి అయ్యవారిపల్లి గ్రామంలోని అమ్మమ్మ వారి ఇంటికి వచ్చింది. రోడ్డు పక్కన ఉన్న కొట్టులో తినుబండారాలు కొనుక్కొని ఇంటికెళ్లే క్రమంలో పామూరు నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో పాపకు తీవ్ర గాయాలయ్యాయి. కారును అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. బాలిక బంధువులు హుటాహుటిన వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. బాలిక తండ్రి అల్లు ప్రసాద్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు. కారు డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పొగాకు బోర్డు సాంకేతిక సిబ్బందికి శిక్షణ

కందుకూరు రూరల్: కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో దక్షిణ తేలిక, దక్షిణ నల్ల నేలల్లో పొగాకు బోర్డు కింద క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సాంకేతిక సిబ్బందికి పొగాకు పంటలో సమగ్ర పంట యాజమాన్యంపై శిక్షణ నిర్వహించారు. రాజమండ్రి నుంచి సిటీఆర్ఐ డైరెక్టర్ ఎం.శేషమాధవ్ అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పొగాకు పరిస్థితులు, దిగుబడులు పెంచుకోవడానికి చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. రాజమండ్రి నుంచి ఎల్‌కే.ప్రసాద్ ఎం.శ్రీధర్ అవగాహన కల్పించారు.

గాలికుంటు టీకాతో..
పశువులకు రక్ష

- జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభం
- మొత్తం 7,28,144 పశువులకు గాను 6,29,700 పశువులకు టీకాలు వేయాలని లక్ష్యం
- ఇప్పటి వరకు 1,99,00 పశువులకు టీకాలు
- వచ్చే 15 వరకు టీకాల కార్యక్రమం

ఒంగోలు సెంట్రల్: మూగ జీవాలపై పలు రకాల వ్యాధులు దాడి చేస్తుంటాయి. ముఖ్యంగా పశువులకు వైరస్ ద్వారా వ్యాపించే గాలికుంటు వ్యాధి కారణంగా ఉత్పాదక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పశుపోషకులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గాలికంటు వ్యాధితో యజమానులు ఇబ్బందులు పడతారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులను సరైన చికిత్సా విధానాలు పాటిస్తే కాపాడుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో 32వ విడత గాలికుంటు వ్యాధి నివారణకు సామూహిక టీకాల కార్యక్రమం చేపట్టారు. వచ్చే నెల 15 వరకు ఈ టీకాల కార్యక్రమం జరగనుంది. జిల్లాలో మొత్తం 7,28,144 లక్షల పశువులు ఉండగా అందులో 6,29,700 పశువులకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా..ఈ నెల 2 నుంచే ఇప్పటి వరకు 1,99,000 పశువుకలు టీకాలు వేశారు.

వ్యాధి లక్షణాలు..

గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో గర్భం విఫలమవుతుంది. వేడిని తట్టుకోలేవు. గేదే, మేక, గొర్రె వంటి జీవాల్లో తీవ్రమైన జ్వరం కనిపిస్తుంది. పాల దిగుబడి తగ్గటం, నోరు, మూతి, కాళ్ల పొదుగు మీద పుండ్లు, బొబ్బలు కనపడటం, కుంటటం, నోటి నుంచి విపరీతమైన నురక కారటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆగస్టు, సెప్టెంబర్, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి వల్ల మరణాల శాతం తక్కువైనా పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గుతుంది. జ్వర తీవ్రత 104–106 డిగ్రీల వరకు పెరిగి పశువులు నీరసిస్తాయి. నోటి పైపొర, పళ్లు, చిగుళ్లు, నాలుక, ముట్టి లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికిపోవడం వల్ల పశువుల నొప్పితో మేత తినవు. నోటి నుంచి చొంగ కారుతుంది.


నిడమానూరులో వ్యాక్సిన్ అందిస్తున్న పశువైద్యులు


విఠలాపురంలో దూడలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు

జిల్లాలో పశుసంపద

జిల్లాలో 7.28 లక్షల పశు సంపద ఉండగా అందులో తెల్లజాతి పశువులు 56,332, నల్లజాతి పశువులు 6,71,812 ఉన్నాయి. మూడు నెలలకు పైబడి ఉన్న 6.29 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ప్రస్తుతం జిల్లాలో పశువైద్యశాఖ ద్వారా ఉచితంగా ఈ టీకాలు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు 38 మండలాల్లో, 18 పశువైద్యశాలల పరిధిలో 152 బృందాల ద్వారా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

> **రైతులు సద్వినియోగం చేసుకోవాలి:**
>
> 
>
> గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జిల్లాలో ప్రారంభమైంది. ప్రతి పాడి రైతు మూడు నెలల వయస్సు పై బడిన ఆవులు, గేదెలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను వేయించాలి. తద్వారా భవిష్యత్‌లో శాశ్వితంగా వ్యాధిని అదుపు చేసే అవకాశం ఉంది. ఈ నెల 2 నుంచి ఫిబ్రవరి 15 వరకు టీకాలు వేస్తాం. ఇప్పటికే 1.99లక్షల పశువులకు టీకాలు అందించాం. పాడి రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
>
> డాక్టర్ పద్మావతి, ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ అధికారి, ఒంగోలు

చూడి పశువుల్లో గర్భస్రావాలు..

పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కొసారి పొదుగు వాపు సంభవిస్తుంది. పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ ఎండ వేడిమికి తట్టుకోలేక నీరసిస్తాయి.

వ్యాధి వ్యాప్తి చెందే విధానం: పశువుల అంతస్రావాల వల్ల వ్యాధి మిగిలిన పశువులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధి కారక క్రిమీ ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారావ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు ఒక చోట నుంచి మరో చోటుకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. సంకర జాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారినపడతాయి.

నివారణ చర్యలు

- పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది. నోటిలో పుండ్ల వల్ల మేత మేయవు. కనుక వాటికి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి.
- జావ, జొన్న, అన్నం, ఉప్పు బెల్లంతో కలిపి ప్రతి రోజు తాగించడం ద్వారా బలహీన పడకుండా జాగ్రత్త వహించాలి. ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేయ్యాలి. వీటి వల్ల మూత్రాలను గడ్డిలో కాలి్ువేయాలి.
- చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. వ్యాధి సోకిన తరువాత వాటిని సుమారు 3 నెలల వరకు సంపర్కానికి వినియోగించరాదు
- కాలి గిట్టల మధ్య పుండ్లను పోటాషియం పర్మాంగనేట్ ద్రావణాలతో కడిగి సీమ్‌లెంట్ వేప నూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి పూయాలి. వైద్యుడిని సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

ముసిపై ఆనకట్ట నిర్మాణానికి కృషి


చిలంకూరులో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూపు సురేష్


కొండయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూపు సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూపు సురేష్

మర్రిపూడి(టంగుటూరు): చిలంకూరు వద్ద ముసి నదిపై ఆనకట్ట నిర్మాణానికి కృషి చేస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూపు సురేష్ అన్నారు. చిలంకూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు మాకినేని కొండయ్య దిశదిన కర్మ కార్యక్రమానికి మంత్రి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముసి నదిపై ఆనకట్ట, రోడ్డు అవసరమని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బ్రిడ్జి ఏర్పాటు వల్ల మర్రిపూడి, చీమకుర్తి మండలాలకు అనుసంధానం ఏర్పడటమే గాకుండా ఒంగోలు సుగమం అవుతుందన్నారు. ఈ ఆనకట్ట నిర్మాణంతో వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అంతేకాకుండా భూగర్భ జలమట్టం పెరిగి మెట్ట పైర్లను విస్తారంగా పండించుకుంటామని విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్..ఇరిగేషన్ ఎస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో దీర్ఘకాలంగా విద్యుత్ సమస్య పట్టిపీడిస్తోందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఇళ్ల నుంచి వైర్లు వెళుతున్నాయని, దీనిన వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, 15 పైగా విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి కూలే అవకాశం ఉందని మంత్రికి విన్నవించారు. అలాగే మర్రిపూడి వీఆర్‌ఓను విధుల నుంచి తొలగించాలని, అతని నిర్లక్ష్యంతో అసైన్‌మెంట్ భూముల క్రమబద్ధీకరణ మందగించిదని ఇంకొల్లు సుబ్బారెడ్డి, బొనుబోయిన నరసింహారావు, మాలపాటి కొండారెడ్డి, సర్పంచి కదిరి భాస్కరరావు మంత్రికి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మాకినేని సుధారాణి వెంకట్రావు, సొసైటీ అధ్యక్షుడు బొవి భాస్కరరెడ్డి, ఎం. వెంకట్రావు, బోధ రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇంకొల్లు సుబ్బారెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కదిరి భాస్కరరావు, పువ్వాడ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకం బ్రహ్మయ్య, వీర్ల చిన్నప నాయుడు, మాకినేని రమణయ్య, కిష్టపడి సుబ్బారెడ్డి, పానికొండ రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభం, 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కోరారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను గురువారం మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విగ్రహ ఆవిష్కరణకు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలిరావాలని కోరారు. టంగుటూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, సింగరాయకొండ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమారరెడ్డి, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి మన్నం వెంకయ్య, యన్నాబత్తిన చిన్నా, దళిత ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, మర్లపాడు సర్పంచి తాళ్లూరి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పింఛన్ మంజూరు

- ఆంధ్రజ్యోతి కథనం అవాస్తవం

కంభం: కంభం–3 సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న తరిటి కమల అనే వృద్ధురాలికి ఈ నెలలోనే కొత్త పింఛన్ మంజూరైందని ఎంపీడీఓ ప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన »అవ్వకు అవస్థ« కథనం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. కంభం–3 సచివాలయం పరిధిలో మొత్తం 4 కొత్త పింఛన్లు మంజూరు కాగా 2వ తేదీ ముగ్గురి పేర్లు లాగిన్‌లోకి వచ్చాయని, కమల పేరు 8వ తేదీ లాగిన్‌లోకి రాగా ఈ నెల 9వ తేదీ వలంటీర్ వృద్ధురాలికి ఈకేవైసీ చేయించుకొని గురువారం ఉదయం పింఛన్ నగదు ఇచ్చారని వివరించారు.


వృద్ధురాలికి గురువారం పింఛన్ నగదు ఇస్తున్న వలంటీర్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: విజయవాడ నగర నడిబొడ్డున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న 206 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజానీకం కదలిరావాలని నగర మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పసుమర్తి గోపి నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచం మెచ్చిన మేధావి అన్నారు. గత ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పిందే తప్ప ఆచరణలోకి తీసుకురాలేదన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 206 అడుగుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్నారన్నారు. కనీసం ఓటు హక్కు కూడా లేని బడుగు బలహీనవర్గాలకు నేడు సమాజంలో తలెత్తుకుని జీవించేలా హక్కులు రాజ్యాంగంలో పొందుపరిచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరి ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. అటువంటి మహనీయుని విగ్రహాన్ని విజయవాడ నగరం నడిబొడ్డున ప్రతిష్టించి ప్రతి ఒక్క వ్యక్తికి స్ఫూర్తిదాయకంగా ఉండేలా విగ్రహాన్ని ఏర్పాటుచేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. చివరకు బీసీలను సైతం గత ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలతో మభ్యపెట్టిందని, కానీ నేడు బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించడంతో పాటు అనేక నామినేటెడ్ పదవుల్లోను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అత్యధిక పదవులు కేటాయించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. తనకు ఒంగోలు నగరానికి తొలి మేయర్‌గా అవకాశం కల్పించిన బాలినేని శ్రీనివాసరెడ్డికి చిరకాలం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పసుమర్తి గోపి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి డివిజన్, వార్డు నుంచి పెద్ద ఎత్తున అంబేడ్కర్ వారసులు హాజరై అంబేడ్కర్ పట్ల తమకు ఉన్న అభిమానాన్ని చాటుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ రెండో క్లస్టర్ ఇన్‌చార్జి రాయపాటి అంకయ్య మాట్లాడుతూ సామాజిక సమత సంకల్ప కార్యక్రమం బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఇందిరాగాంధీ స్టేడియం పక్కన దాదాపు 20 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయడం అంటే అది కేవలం ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యపడిందన్నారు. ఇదే సమయంలో ఒంగోలులో 24 వేల మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు అవసరమైన నిధులు విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, ఇందుకు సీఎంకు పేద ప్రజానీకం పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం జనార్దన్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కేవలం నేరుగా తరలివచ్చి చూడడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించనున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే అంబేడ్కర్ ఆశయానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరి పోశారని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అటువంటి నేతను మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవడం ద్వారా మాత్రమే అంబేడ్కర్ ఆశయాలను సజీవంగా సాధ్యం చేసుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి బేతపూడి రాజేశ్వరి, యరజర్ల రమేష్, యువజన విభాగం నగర అధ్యక్షుడు కాకుమాను సునీల్‌రాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ గంగాడ సుజాత

మూగజీవాలను హింసిస్తే చర్యలు

- పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బేబిరాణి

పొదిలిరూరల్: జీవాల పెంపకందారులు మూగ జీవాలను చిత్రహింసలకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.బేబిరాణి హెచ్చరించారు. గురువారం పొదిలి వచ్చిన ఆమె ఓ వ్యక్తి తమ కుక్కపిల్లను ద్విచక్ర వాహనానికి గొలుసుతో కట్టి ఈడ్చుకెళ్ల డాన్ని చూసి చలించిపోయారు. వెంటనే తన వాహనాన్ని ఆపి ఆ వ్యక్తిని పిలిచి మందలించారు. తన పెంపుడు కుక్క తాను చెప్పిన మాట వినడం లేదని ఆ వ్యక్తి చెప్పాడు. కుక్కపిల్లను బండి కట్టి ఈడ్చుకెళ్లడాన్ని ఆమె తప్పుపట్టారు. పెంపుడు జంతువులను ప్రేమతో, జాగ్రత్తగా తమ పిల్లల మాదిరిగా పెంచుకోవాలే కానీ, ఇలా చిత్రహింసలు పెట్టడం తగదన్నారు. ఇలాంటి సంఘటన మరలా పునరావృతం కాకూడదని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


కుక్కను చిత్ర హింసలు పెట్టిన వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న బేబిరాణి

21న 'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ


కరపత్రాన్ని విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు టౌన్: మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మండలిలో చేసిన ప్రసంగాలు పుస్తకంగా రానుంది. ఈ నెల 21వ తేదీన గుంటూరులోని ఎన్‌జీఓ కళ్యాణ మండంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు గురువారం ఎల్బీజీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు హాజరవుతారని, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పుస్తకాన్ని పరిచయం చేస్తారని తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ అభివృద్ధి సదస్సు జరుగుతుందన్నారు. సదస్సులో వివిధ అంశాలపై మధురై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేష్ ఆత్రేయ, ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ ఏ సుబ్బరామిరెడ్డి, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ ఉపన్యసిస్తారని తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.రవి, ఎస్‌కే ఖాజా హుసేన్, కె.సుబ్రహ్మణ్యం, నల్లూరి వెంకటేశ్వర్లు, జి.ఉమామహేశ్వరి, ఎస్వీ రంగారెడ్డి, సీహెచ్ జయప్రకాశ్, తిరుపతయ్య, మాలకొండయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

35 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక


ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87లో బ్యాచ్ విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చిన స్నేహితులు చదివిన పాఠశాలలో కలవాలని నిర్ణయించుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. శారీరకంగా, ఆర్థికంగా మార్పులు జరిగినా మనుసులు మాత్రం మారలేదని ఒకరినొకరు వారి అభిప్రాయాలు పంచుకున్నారు. సొసైటీ మస్తాన్, కేశవరావు, రమణారెడ్డి, లింగారెడ్డి, సుబ్బారెడ్డి, అచ్చిరెడ్డి, రామిరెడ్డి చొరవ తీసుకొని స్నేహితులంతా కలిసేలా చూశారు. స్నేహితులంతా ఒకరినొకరు ఆత్మీయ అనుభవాలు పంచుకున్నారు. చిన్న నాటి ఊసులన్నింటినీ గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పటి మారుపేర్లతో ఒకరినొకరు పిలుచుకుంటూ నాటి సంగతులు చేసిన చిలిపి పనులన్నీ గుర్తు చేసుకున్నారు. స్నేహభావంతో ఒకరినొకరు మనస్ఫూర్తిగా ఆప్యాయతలు పంచుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ న్యూ లాంచింగ్ ఇన్ ఆంధ్రారిచిస్ కంపెనీ : FMCG, కాస్మోటిక్, హెల్త్ కేర్ ప్రొడక్ట్స్‌కు జిల్లాలోని ప్రతి గ్రామ, మండలం, నియోజకవర్గాల వారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. ✆ 94408 16602 [O-192047]

BATTRY & INVERTORS

■ AMARON, బ్యాటరీ & ఇన్వెర్టర్స్ చందు బ్యాటరీస్ & ఇన్వెర్టర్స్ సేల్స్ & సర్వీస్ శ్రీ వీరాంజనేయ స్వామి గుడి, పిరమిడ్ దగ్గర, పాత బ్యాంక్ సెంటర్, ఈతముక్కల ✆ 72870 30883 [O-192048]

Wanted

■ సాయిరత్న ఫిల్లింగ్ స్టేషన్ కర్నూల్‌రోడ్, ఒంగోలు, RTC డిపో ప్రక్కన పెట్రోల్ బంక్ నందు ఆయిల్ ఫిల్ చేయుటకు పంప్ బాయ్స్ / గర్ల్స్ కావలెను. జీతం 12000/- ✆ 93469 32406 [O-192046]

■ తమిళనాడులోని ప్రముఖ యూనివర్సిటీకు అడ్మిషన్లు చేయుటకు జిల్లా మరియు మండలాల వారీగా ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86108 15820, 99632 88792 [OA-184]

■ ఒంగోలు పట్టణ వివాహిత మహిళలకు ప్రముఖ కంపెనీలో పర్మనెంట్ జాబ్ అవకాశం Q:డిగ్రీ పాస్,A:30సం॥పైన జీ॥17,000/-సం॥ ✆ 90006 34709, 92471 24530. [O-192069]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167599]

■ గుంటూరు – చిలకలూరిపేట NH-16, కాటూరి మెడికల్ కాలేజి దగ్గర, చినకొండ్రుపాడు నందు గల ప్రముఖ టుబాకో త్రెషింగ్ ఫ్యాక్టరీ నందు పర్మినెంట్ ఉద్యోగస్తులుగా పనిచేయుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. ఉద్యోగం: ప్రొడక్షన్ కెమిస్ట్. అర్హత: B.Sc./M.Sc., అనుభవం:పొగాకులో కెమిస్ట్రీని ఆటో ఎనలైజర్ ద్వారా విశ్లేషించ గలిగే సామర్థ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. అభ్యర్థులు మీ బయోడేటాను 15 రోజులలో psshr.recruit@gmail.com కు పంపగలరు. [G-410]

■ RAZA Hindusthan Nidhi Ltd. నందు మండలాల వారీగా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 15000 నుండి 25వేల వరకు + ఇన్సెంటివ్ కలదు. సెల్: 79812 10008. [N-1189933]

■ డైరెక్ట్ జాయినింగ్, పైపులు, గ్రానైట్స్, పాల డెయిరీ, రొయ్యలు, టుబాకో కంపెనీలలో సూ.వైజర్స్, స్టోర్ ఇన్‌ఛార్జి, Ex-ఆర్మీ, ITI, Dip- All, PF, ESI. జీ: 18-35వేలు. రూం+భో. ✆ 9492179598. [B-782151]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02856
90102 02762